క్లుప్తంగా

ప్రభుత్వ భవనాల నిర్మాణం అభివృద్ధి కాదా?



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

బాడంగి: ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు తీసుకురావాలన్న సదుద్దేశ్యంతో ప్రభుత్వం గ్రామాల్లో చేపడుతున్న ప్రభుత్వ భవనాల నిర్మాణం అభివృద్ధి కాదా అని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు ప్రశ్నించారు. మండలంలోని పాల్తేరు గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష శిబిరాలు వద్ద అవసరమైన వారికి కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. అనంతరం జరిగిన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందజేయడంతో పాటు అభివృద్ధి పనులు కూడా చేపడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో పోర్టులు, విమానాశ్రయాల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని, మరోవైపు ప్రతీ గ్రామంలో సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం నిర్మించి, ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. వీటితో పాటు ప్రతీ సచివాలయం పరిధిలో రూ.20 లక్షల చొప్పున రోడ్లు, డ్రైనేజీలు వంటివి నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. ఇవన్నీ అభివృద్ధి పనులు కాదా టీడీపీ నేతలకు ఇవి కనబడవా అని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే టీడీపీ, ఎల్లోమీడియా బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని, అయితే జగనన్న ప్రజారంజక పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యు.వివేక, జెడ్పీటీసీ పి.రామారావు, ఎంపీటీసీ వి.దివ్య, తహసీల్దార్ రఫీజాన్ తదితరులు పాల్గొన్నారు.

చల్లపేట ఆస్పత్రిని సందర్శించిన డిప్యూటీ సీఎం



ఆస్పత్రి కొత్త భవనం వద్ద డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

మెంటాడ: మండలంలోని చల్లపేట ఆస్పత్రిని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర మంగళవారం సందర్శించారు. అనంతరం అక్కడి రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై సిబ్బందిని ఆరాతీశారు. అలాగే సక్రమంగా సేవలు అందుతున్నాయా లేదా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ఆస్పత్రి ఆవరణలో దాదాపు రూ.1.73 కోట్ల వ్యయంతో పూర్తి చేసుకున్న నూతన ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ఈ నెలాఖరు నాటికి ఆస్పత్రి భవనం ప్రారంభోత్సవం జరుగుతుందని తెలిపారు.

ఘనంగా దేశమ్మతల్లి వారాలు

బొబ్బిలి: మండలంలోని అలజంగి గ్రామంలో దేశమ్మతల్లి వారాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ముర్రాటలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఏడాదంతా ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించేలా చూడాలని అమ్మవారిని భక్తులు వేడుకున్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

బొబ్బిలి: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బీఎల్‌ఓలతో ఆర్‌డీఓ పి.శేషశైలజ మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో షెడ్యూల్ ప్రకారం బీఎల్‌ఓలు తమ విధులు నిర్వహించాలని సూచించారు. ఓటర్ల ఫొటోలు, చిరునామాలు, మార్పులు, చేర్పులు చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డోల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు రుషింగిలో గడప గడపకు..

వంగర: మండలంలోని రుషింగి గ్రామంలో ఈ నెల 12వ తేదీన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు హాజరు కానున్నారని, మండల స్థాయి అధికారులు, నేతలంతా హాజరుకావాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బొబ్బిలి / రాజాం
9951602891, 9010133309
Office mail : vzmadvt@gmail.com

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం



రాజాం: కోవిడ్ విపత్తు సమయంలో లక్ష్మీపురంలో ఇంటింటా సర్వే చేస్తున్న వలంటీర్లు(ఫైల్)

ప్రజాసేవే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వలంటీర్ల ద్వారా ప్రజల వద్దకే నేరుగా సంక్షేమ పథకాలు, మరెన్నో రకాల సేవలు అందుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలోని టీడీపీ ప్రభుత్వానికి భిన్నంగా అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ సేవలు అందుతుండడంతో వలంటీర్ల సేవలను లబ్ధిదారులు అభినందిస్తున్నారు. కోవిడ్ విపత్తు సమయంలో వలంటీర్ వ్యవస్థ ఓ రక్షణ కవచంలా పనిచేసి, ప్రజల ప్రాణాలు కాపాడిందని మెచ్చుకుంటున్నారు.

– రాజాం సాక్షి నెట్‌వర్క్

పవన్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు..



వలంటీర్లపై తప్పుగా మాట్లాడిన పవన్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారు. వలంటీర్ వ్యవస్థ రాష్ట్ర ప్రజలకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. కష్టకాలంలో పేదలను ఆదుకుంటోంది. ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు అందివ్వడంతో పాటు ఏ రకమైన ప్రభుత్వ సేవలనైనా వలంటీర్లే దగ్గరుండి చేస్తున్నారు. అటువంటి వలంటీర్లపై తప్పుడు ఆరోపణలు సరికాదు. – బింగి సూర్యనారాయణ, నందబలగ, రాజాం మండలం.

కావాలనే టార్గెట్ చేస్తున్నారు..



వలంటీర్లు సేవాస్ఫూర్తితో వ్యవహరిస్తున్నారు. ఇంతవరకు ఎక్కడా వారిపై చెడ్డ పని చేశారన్న మచ్చ లేదు. టీడీపీ, జనసేన పార్టీలు కలిసి కావాలనే వలంటీర్లను టార్గెట్ చేస్తున్నాయి. ప్రజలకు వారు అందిస్తున్న సేవల ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే ఈ పనికి ఒడిగట్టారు.

– దవళ నర్సింహమూర్తి, అప్పలఅగ్రహారం, సంతకవిటి మండలం.

వలంటీర్ వ్యవస్థ పేదలకు వరం..



ప్రభుత్వం తీసుకువచ్చిన వలంటీర్ వ్యవస్థ పేద ప్రజలకు ఓ వరం లాంటిది. కోవిడ్ విపత్తు సమయంలో ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు భయపడిన జనం వద్దకే ప్రభుత్వం పంపిణీ చేసిన రేషన్ సరుకులు, వైద్యసేవలు అందేలా చూసిన వారి సేవలు వెలకట్టలేనివి. అలాంటి వారిపై జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ విమర్శలు చేయడం బాధాకరం. –తాడ్డి జగదీశ్వరి, లక్ష్మీపురం, రాజాం మండలం.

తప్పుగా మాట్లాడితే సహించం..



వలంటీర్ల సేవలు అద్భుతం. రూ.5 వేల గౌరవ వేతనానికే ప్రజలకు నిస్వార్థమైన సేవలందిస్తున్నారు. ప్రజలకు చేదోడు వాదోడుగా ఉంటున్న వలంటీర్ల గురించి, తప్పుగా మాట్లాడితే సహించేది లేదు.

– తాడ్డి పాపాయమ్మ, లక్ష్మీపురం, రాజాం మండలం.

వలంటీర్ల సేవలు అద్భుతం..



రాష్ట్రంలోని వలంటీర్ల సేవలు అద్భుతం. ఇతర రాష్ట్రాలు కూడా ఈ వలంటీర్ వ్యవస్థను అమలు చేయాలని చూస్తున్నాయి. కావాలనే వారిపై పవన్ మతిభ్రమించి, ఆరోపణలు చేయడం సిగ్గుచేటు. వలంటీర్లపై పవన్ తప్పుడు వ్యాఖ్యలు ఆయన పరువును దిగజార్చాయి. – అంబళ్ల సరస్వతి, చింతలిపేట గ్రామం, సంతకవిటి మండలం

నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి బొత్స సమీక్ష



అభివృద్ధి పనులపై జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

- అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి
- నెలాఖరులోగా ప్రభుత్వ భవనాలు ప్రారంభించాలి
- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

రాజాం: నియోజకవర్గం వ్యాప్తంగా పూర్తి కావస్తున్న సచివాలయ, వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణాలను ఈ నెలాఖరులోగా ప్రారంభించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశించారు. మంగళవారం స్థానిక సూర్య దుర్గా కల్యాణ మండపంలో రాజాం నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే కంబాల జోగులుతో కలిసి సమీక్ష నిర్వహించిన ఆయన అభివృద్ధి పనులు జరుగుతున్న తీరుతెన్నులపై సంబంధిత అధికారులను ఆరాతీశారు. ప్రజలకు గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు అందాలన్న సదుద్దేశ్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారని, ఇటువంటి సచివాలయాలు అద్దె భవనాలు, శిథిలావస్థ భవనాల్లో ఉండకూడదనే అన్నిచోట్ల పక్కా భవనాలు నిర్మించడం జరుగుతోందన్నారు. నిర్మాణాలకు సంబంధించి, బిల్లుల చెల్లింపు కూడా సకాలంలో జరుగుతోందని, నిర్మాణాల పూర్తిలో జాప్యం చేయొద్దని సూచించారు. పెండింగ్‌లో ఏవైనా బిల్లులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ క్రమంలో రాజాం, వంగర మండలాలకు చెందిన ఒకరిద్దరు కాంట్రాక్టర్లు సిమెంటు సరఫరాకు సంబంధించిన ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే రాజాం రోడ్డు విస్తరణ పనులపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయని అధికారులను ప్రశ్నించారు. పనుల్లో అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై ప్రజాప్రతినిధులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. అంతకుముందు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులులు మాట్లాడుతూ రాజాం ప్రాంతం విజయనగరం జిల్లాలో కలిసిన తర్వాత ఎంతో అభివృద్ధి చెందిందని వివరించారు. రోడ్డు విస్తరణతో పాటు పలు అభివృద్ధి పనులు జరిగాయని, జలజీవన్ మిషన్‌కు రూ.14 కోట్ల వరకు కేటాయింపులు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహనరావు, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ కంబాల సందీప్, ఆర్‌డీఓ అప్పారావు, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, వైఎస్సార్ సీపీ కన్వీనర్లు పి.శ్రీనివాసరావు, ఎల్.రాజగోపాలనాయుడు, పి.లక్ష్మణరావు, జెడ్పీటీసీ బి.నర్సింహులు, రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



రాజాం సిటీ: ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



బొబ్బిలి: ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం సిటీ: ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని కొండంపేట, కొత్తవలస, ఆదర్శనగర్ సచివాలయాల పరిధిలోని వస్త్రపురి కాలనీలో మంగళవారం పర్యటించిన ఆయనకు ఆయా ప్రాంతాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రతీ ఇంటికి మేలు జరిగేలా ఆయన పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ప్రభుత్వానికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసిఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. అప్పటి టీడీపీ పాలనకు...ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను ప్రజలు గమనిస్తున్నారన్నారు. టీడీపీ నేతలు చెప్పే పచ్చి అబద్ధాలను ప్రజలు నమ్మరన్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీదే విజయమని, మరోసారి సీఎం జగనన్న ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు, నేతలు గణపతి, గోపాలం, వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు: ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని పిరిడి గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలని కోరారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందించడంతో పాటు ప్రతీ గ్రామంలో సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ల భవనాలు, రోడ్లు, డ్రైనేజీలు వంటి అభివృద్ధి పనులు చేయడం జరుగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీదే మళ్లీ విజయమని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.లక్ష్మి, జెడ్పీటీసీ ఎస్.శాంతకుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు బి.కాశినాయుడు, సర్పంచ్ టి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

పశుగ్రాసం పెంపకంపై దృష్టిసారించాలి

తెర్లాం: పశుగ్రాసం పెంపకంపై రైతులు దృష్టిసారించాలని పశుసంవర్ధక శాఖ తెర్లాం, బాడంగి మండలాల ఏడీ కె.నాగరాజు, మండల పశువైద్యాధికారి జె.నరేంద్రకుమార్ సూచించారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మండలంలోని నందిగాం ఆర్‌బీకేలో మంగళవారం రైతులతో సమావేశమైన వారు పాడి పశువులకు పచ్చనిగడ్డిని మేతగా వేయడం వల్ల పాలదిగుబడి ఘననీయంగా పెరుగుతుందన్నారు. ప్రభుత్వం గడ్డి విత్తనాలను కూడా సబ్సిడీపై సరఫరా చేస్తోందని తెలిపారు.

ఏపీ యూటీఎఫ్ నూతన కార్యదర్శిగా శ్రీనివాసరావు

రాజాం/సంతకవిటి: రాజాంలోని మారుతీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద ఏపీ యూటీఎఫ్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. కొత్తగా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శిగా కొమరపురి శ్రీనివాసరావును ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. అనంతరం ఉపాధ్యాయ సమస్యలు, సీపీఎస్ రద్దు, పీఆర్‌సీ అమలు, డీఏల చెల్లింపు అంశాలపై చర్చించారు.

జీవామృతం తయారీపై అవగాహన

రేగిడి: మండలంలోని ఉప్పరనాయుడువలస గ్రామంలో జీవామృతం తయారీపై మంగళవారం అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ, ఐసీఆర్‌పీలు పి.తవిటినాయుడు, కె.రమణ, ఆర్.సింహాచలం జీవామృతం తయారీని ప్రయోగాత్మకంగా రైతులకు వివరించి, దానిని పంటలకు వినియోగించి, అధిక దిగుబడి సాధించాలని కోరారు.

ఫిజియోథెరపీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రామభద్రపురం: స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగులైన చిన్నారులకు అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను ఎంఈఓ తిరుమల ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఫిజియోథెరపీతో ఆరోగ్యం మెరుగుపడుతుందని, దివ్యాంగులైన పిల్లలను తల్లిదండ్రులు కేంద్రాల వద్దకు తీసుకువచ్చి, వారికి ఫిజియోథెరపీ అందేలా చూడాలన్నారు. ఇంటి దగ్గర కూడా ప్రతిరోజూ ఫిజియోథెరపీ చేసుకోవాలన్నారు.

డ్రోన్ సర్వే

రేగిడి: భూముల రీసర్వేలో భాగంగా మండలంలోని ఆమదాలవలస గ్రామంలో అధికారులు డ్రోన్ సర్వే మంగళవారం నిర్వహించారు. మాట్లాడుతూ పక్కాగా రైతుల సమక్షంలో సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు చేయాలని తహసీల్దార్ ఎ.కల్యాణ చక్రవర్తి సూచించారు.

'జగనన్న సురక్ష' పేదలకు వరం

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



రామభద్రపురం: జన్నివలసలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి



రాజాం: గడిముడిదాంలో ధ్రువీకరణపత్రాలు అందిస్తున్న ఎంపీపీ సులోచన



తెర్లాం: కూనాయవలసలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి, ఎంపీడీఓ రామకృష్ణ

రామభద్రపురం: ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందించాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమం పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని జన్నివలస, కోటశిర్లాం గ్రామ సచివాలయాల పరిధిలో తహసీల్దార్ రాజారావు, ఎంపీడీఓ రమామణి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పలువురికి అవసరమైన పలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు అర్హులందరికీ తప్పనిసరిగా అందేలా చేయడం కోసం చేస్తున్న ఈ కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇదే కార్యక్రమం ద్వారా జనన, మరణ, కుల, ఆదాయం వంటి 11 రకాల ధ్రువీకరణ పత్రాలను అవసరమైన వారికి ఉచితంగా అందించడం జరుగుతోందని, దీంతో ఎక్కడికి వెళ్లినా గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ సేవలు అందుతున్నాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. పేదలు బాగుండాలని నిరంతరం పరితపించే సీఎం జగనన్నను మరోసారి ఆశీర్వదించి, మళ్లీ ఆయనను సీఎంను చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, జన్నివలస సర్పంచ్ సారంగదొర, కోటశిర్లాం సర్పంచ్ టి.తిరుపతమ్మ, కొట్టక్కి పీఏసీఎస్ చైర్మన్ పి.సత్యనారాయణ, మండల జేసీఎస్ కన్వీనర్ సీహెచ్ సింహాచలంనాయుడు, ఈఓపీఆర్‌డీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా సిటిజన్ సర్వీసులు..

తెర్లాం: మండలంలోని పణుకువలస, కూనాయవలస గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి ధ్రువీకరణ పత్రాల కోసం పేర్లు నమోదు చేసుకున్న పలువురికి వాటిని(ధ్రువీకరణ పత్రాలు) అందజేశారు. ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన 11 రకాల సిటిజన్ సర్వీసులకు సంబంధించిన సర్టిఫికెట్లను ఉచితంగా వారి గ్రామాల్లోనే ప్రభుత్వం మంజూరు చేస్తోందని తెలిపారు. కూనావయలసలో 800 మందికి గాను 630 మందికి వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ, వైస్ ఎంపీపీ సీహెచ్ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఎం.ఎ.స్వామి, ఏఓ సునీల్‌కుమార్, సర్పంచ్ విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

వంగర: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎం.సీతారాంపురం గ్రామంలో ఎంపీపీ సురేష్ ముఖర్జీ చేతులమీదుగా పలువురికి పలు ధ్రువీకరణ పత్రాలు మంగళవారం అందజేశారు. జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు సేవలందించేందుకేనని, ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ఉచితంగా 11 సిటిజన్ సర్వీసులను అందిస్తోందన్నారు.

సంతకవిటి: మండలంలోని సురవరం, చిత్తారపురం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి, ఎంపీడీఓ జి.వి.రవికుమార్, తహసీల్దార్ ఎ.సులోచనరాణి చేతులమీదుగా పలువురికి పలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ప్రజాసేవే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ, తహసీల్దార్ కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జి.షణ్ముఖ్, ఎం.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని గడిముడిదాం గ్రామంలోని పలువురు లబ్ధిదారులకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను ఎంపీపీ లావేటి సులోచన చేతులమీదుగా మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సుధాకర్‌రావు, వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ కన్వీనర్ ఎల్.రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బి.నర్సింహులు, వైస్ ఎంపీపీ వై.వెంకటేష్, సర్పంచ్ ఎల్. రమాదేవి, ఎంపీడీఓ శంకరరావు, తహసీల్దార్ ఎస్.కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: మండలంలోని కమ్మవలస గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాలనాయుడు చేతులమీదుగా పలువురికి పలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎస్.శాంతకుమారి, తహసీల్దార్ డి.రాజేశ్వరరావు, ఎంపీడీఓ పి.రవికుమార్, సర్పంచ్ వసుంధర తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంపై ఎంపీడీఓ ఆగ్రహం

తెర్లాం: మండలంలోని కూనాయవలస సచివాలయ ఏఎన్‌ఎం ఎం.సూర్యకుమారిపై ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష శిబిరం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి మంగళవారం విచ్చేసిన ఆయన శిబిరానికి ఎంతమంది రోగులు వచ్చారు.. ఎంతమంది రోగులకు తనిఖీలు చేశారు..

ఏయే రకాల మందులు పంపిణీ చేశారోనన్న రికార్డులు నమోదు చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీపీ ఉమాలక్ష్మి, సర్పంచ్ విజయబాబు తదితరులు ఉన్నారు.

ఖబడ్దార్ ప్యాకేజీ స్టార్

- జనసేన చీఫ్ పవన్ వైఖరిపై వలంటీర్ల మండిపాటు



సంతకవిటి: పవన్ కల్యాణ్‌పై ఫిర్యాదు చేస్తున్న చిత్తారిపురం గ్రామ వలంటీర్లు

బొబ్బిలి: వలంటీర్లపై జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మహిళా వలంటీర్లు మండిపడ్డారు. ఇదే విషయమై వారంతా స్థానిక పట్టణంలోని శ్రీవేణు గోపాలస్వామి ఆలయం జంక్షన్‌లో సమావేశమై పవన్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలంటే ఎందుకంత చులకన భావమని, ఇంగితజ్ఞానం లేకపోవడం వల్లే వలంటీర్లను కించపరుస్తూ మాట్లాడుతున్నారని వలంటీర్లు దుయ్యబట్టారు. అనంతరం జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం చేపట్టి, పవన్ డౌన్ డౌన్, ప్యాకేజీ స్టార్ ఖబడ్దార్, దత్తపుత్రుడా ఒళ్లు దగ్గర పెట్టుకో.. అంటూ నినాదాలు చేశారు. మహిళల పట్ల కనీస గౌరవం లేని పవన్ వలంటీర్లను కిడ్నాపర్లుగా, మానవ అక్రమ రవాణాకు పాల్పడే వారిగా పరిగణిస్తూ మాట్లాడడం చాలా సిగ్గుచేటన్నారు. కోవిడ్ విపత్తు సమయంలో ప్రాణాలకు తెగించి, సేవలందించిన వలంటీర్లను దేశమంతా చూసి, గర్వించిందన్నారు. ప్రజాసేవే పరమావధిగా లంచాలకు తావులేకుండా పారదర్శకంగా ప్రజలకు ప్రభుత్వ సేవలు, పథకాలు అందిస్తున్న వలంటీర్లపై లేనిపోని ఆరోపణలు చేసిన పవన్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఇకనుంచైనా ఇటువంటి మాటలు మాట్లాడడం మానుకోవాలని, లేకపోతే ప్రజాగ్రహానికి గురవుతారని హెచ్చరించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని, పవన్‌పై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హమీద్, వైస్ ఎంపీపీ ఎ.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: పవన్ తీరుకు వ్యతిరేకంగా మానవహారం చేపట్టి, నిరసన తెలుపుతున్న వలంటీర్లు

పవన్‌పై పోలీసులకు ఫిర్యాదు..

సంతకవిటి: మండలంలోని చిత్తారిపురం గ్రామానికి చెందిన వలంటీర్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై మంగళవారం ఫిర్యాదు చేశారు. వారాహి యాత్రలో భాగంగా ఏలూరులో జరిగిన కార్యక్రమంలో పవన్ వలంటీర్లపై అనుచిత వాఖ్యలు చేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని వలంటీర్లు పోలీసులను కోరారు.


శ్రద్ధాంజలి
మహోన్నత వ్యక్తిత్వంతో
మా అందరి హృదయాలలో చిరస్థాయిగా
నిలిచి, మా అందరి ఉన్నతికి బంగారు బాటలు
వేసిన మీరు స్వర్గస్తులైనందుకు చింతిస్తూ...
మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని
దేవుని ప్రార్థిస్తూ...
చీపురుపల్లి వీధి, బొబ్బిలి
జననం: 24-04-1941, మరణం: 01-7-2023
మనుమరాండ్రు, మనుమలు
కుమార్తెలు - అల్లుళ్ళు
మజ్జి ఉషారాణి - జగన్నాథం
పతివాడ సుధారాణి - లేటు పైడిరాజు
కుమారుడు - కోడలు
తాడ్డి లావణ్య - శ్రీనివాసనాయుడు
పతివాడ కళ్యాణ్ - స్వరూపిణి
12-07-2023